క్లుప్తంగా

అధ్యక్షుడిగా మల్లేశ్

రేగొండ: గౌడ సంఘం రేగొండ గ్రామ అధ్యక్షుడిగా తడక మల్లేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం రేణుక ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మోడెం ఉమేష్ గౌడ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా తిరుపతి, కొమురయ్య, సమ్మయ్య, కుమారస్వామి, మొగిళి, సతీష్, సుధాకర్, శంకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ.. గౌడ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ అవార్డుకు ఎంపిక


శ్రీనివాస్

మొగుళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన మంగళపల్లి శ్రీనివాస్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా నిర్వాహకుడు ఆకుల రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీనివాస్ సేవలను గుర్తించి జాతీయ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ మేరకు అక్టోబర్ 31న హైదరాబాద్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు యూనివర్సిటీలో అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

చర్య తీసుకోవాలి


మాట్లాడుతున్న రైతు ఓదెలు

భూపాలపల్లి రూరల్: పంట చేతికి వచ్చే సమయంలో పత్తి పంటను నరికి వేసి నానా బీభత్సం సృష్టించిన కొంతమంది అక్రమణదారులపై చర్య తీసుకొని న్యాయం చేయాలని జాలిగపు ఓదెలు అధికారులను కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిట్యాల మండలం చల్లగరిగే గ్రామంలో వారసత్వంగా వచ్చిన ఎకరంన్నర భూమిలో ఎనిమిది ఏళ్లుగా పత్తి సాగు చేసుకుంటున్నానన్నారు. పంట చేతికి వచ్చే సమయంలో అదే గ్రామానికి చెందిన పలువురు రాత్రి సమయంలో కొడవలి, గొడ్డళ్లతో పత్తి పంటను నరికి నాశనం చేశారన్నారు. గ్రామంలో పంచాయతీ పెద్దలు చెప్పినప్పటికీ వినడం లేదన్నారు. గతంలో కూడా ఎస్సై మోకాపైకి వచ్చి చూసి నష్టం చేయకూడదని సూచించారని తెలిపారన్నారు. ఈ విషయంపై చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఫలితం లేదని, ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు ఓదెలు తెలిపారు.

సుభాష్‌నగర్‌లో వైద్యశిబిరం



మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సుభాష్‌నగర్‌లో తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ సంగీత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 36 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారి రక్త నమూనాలు సేకరించి, ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

కన్నాయిగూడెం: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందని డాక్టర్ అభినవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో స్వస్థ్ నారి సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గైనాకాలజిస్ట్ అనిత హాజరై మహిళలకు వివిధ వాధులపై పరీక్షలు చేసి మందులు అందించారు. అనంతరం డాక్టర్ అభినవ్ మాట్లాడుతూ... ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. మహిళలు ఆరోగ్యంపై జాగ్రతలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, రమణ కుమారి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఏటూరునాగారం: గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను డైలీ వేజ్ వర్కర్లు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంత్రిని కలిసి వారి సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. స్పందించిన సీతక్క రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దావూద్, రత్నం రాజేందర్ మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలో 20 మంది వర్కర్లకు టైమ్ స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నారని అదేవిధంగా ఇక్కడ కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ నాగలక్ష్మి, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, కమల, జయలక్ష్మి ఉన్నారు.

రోడ్డుపైనే వారాంతపు సంత

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, వ్యాపారులు
- ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయాలని కోరుతున్న స్థానికులు


ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

చిట్యాల: మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే వారాంతపు సంత రోడ్డుపైనే నిర్వహిస్తున్నారు. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే వాహనాలతో పాటు వివిధ మండలాల నుంచి వచ్చే వాహనాలు ఈ దారి గుండానే వెళ్లాల్సి ఉంటుంది. సంతకు వచ్చే వారు రోడ్డుపైనే వాహనాలను నిలిపివేయడంతో వాహనదారులకు ఇబ్బందులు కలుగుతోంది. ట్రాఫిక్ జామ్ అయి ప్రమాదాల భారిన పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో కూరగాయల వ్యాపారస్తులు అనేక అవస్థలు పడుతున్నారు. సరైనా సౌకర్యాలు లేక పోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలో 25 గ్రామల ప్రజలు వివిధ కార్యాలయాలకు వచ్చిపోయే వారు ప్రతీ వారం ఇక్కడే సరిపడా కూరగాయలు కొనుక్కొని వెళ్తుంటారు. దీంతో వ్యాపారస్తులకు వ్యాపారంతో పాటు వందలాది మందికి ప్రతీ వారం ఉపాధి కలుగుతుంది. సంత కోసం అనువైన స్థలం లేకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సంత కోసం అనువైన స్థలాన్ని కేటాయించి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

పచ్చని వేప చెట్టుకు నిప్పు


చెట్టులోకి వెళ్లి నీరు పడుతున్న గ్రామస్తులు, పోలీసులు


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

- రెండు గంటలు శ్రమించిన ఎస్సై శ్రావణ్‌కుమార్, గ్రామస్తులు

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో విద్యార్థులకు నీడనిచ్చే వందేళ్ల పచ్చని వేపచెట్టుకు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నిప్పుపెట్టారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. పాఠశాలలోని ఆవరణంలోని వేప చెట్టుకు మంటలు రావడం సోమవారం వ్యాయమానికి వచ్చిన గ్రామస్తులు చూసి ఉపాధ్యాయుడికి సమాచారం అందించారు. దీంతో ఉపాధ్యాయుడు, స్థానికులు పాఠశాలలో ఉన్న మోటార్‌పంపు నీటితో కాలుతున్న చెట్టుకు నీరు పట్టిన ఫలితం లేదు. సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రావన్‌కుమార్ సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శి రవికుమార్, గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. రెండు గంటలు మంటలు ఆర్పేందుకు అష్టాకష్టాలు పడ్డారు. మోటారు పైపుతో పాటు బుర్ర పంపుతో చెట్టు తొర్రలోపలికి వెళ్లి మరి నీరు పడుతూ కాలిన బొగ్గును బయటకు తీసి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం భూపాలపల్లి ఫైర్ స్టేషన్ నుంచి ఫైర్‌ఇంజన్ వచ్చి నీరు పట్టడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. వందేళ్ల వేప చెట్టుకు నిప్పు పెట్టడం ఆకతాయిల పనేనని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఇంజన్ సిబ్బంది రమేశ్, నరేష్, సురేష్, ప్రతాప్, నవీన్ కుమార్‌లు, పోలీస్ సిబ్బంది లాల్‌సింగ్, రాజు, గ్రామస్తులు గుర్రం తిరుపతి, వెల్పుల రాజ్‌కుమార్, సురేష్, కోడేల మహేష్, శ్రీనివాస్ ఉన్నారు.

కొలువుదీరిన అమ్మవారు


భూపాలపల్లి అర్బన్: వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు


గణపురం: పూజలు చేస్తున్న సీఈ దంపతులు


భూపాలపల్లి అర్బన్: సుభాష్ కాలనీలో..

భూపాలపల్లి అర్బన్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. దుర్గామాత ఉత్సవ విగ్రహాలను నిర్వాహకులు డప్పుచప్పుళ్ల మధ్య మేళతాళాలతో మండపాలకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. తొలిరోజు అమ్మవారు భక్తులకు బాలా త్రిపురసుందరీ దేవిగా దర్శనమిచ్చారు. ప్రజలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకొని తీర్థప్రసాదాదలు స్వీకరించారు. పలువురు అమ్మవారి దీక్షమాలను ధరించారు. తొమ్మిది రోజులు అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు.

గణపురం: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో దుర్గామాతను పలు మండపాలలో కొలువుదీరింది. తొలి రోజు అమ్మవారు భక్తులకు బాలా త్రిపురదేవి అలంకరణలో దర్శనమించ్చారు. కేటీపీపీలో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంటు సూపరింటెండింట్ ఇంజనీర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దుర్గా మాత వద్ద సీఈ చిట్టా ప్రగడ ప్రకాశ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కేటీకే 8 ఇంక్‌లైన్‌లో పరిధిలోని ఆలయంలో సింగరేణి అధికారులు, కార్మికులు ప్రత్యేక పూజలు చేశారు.

సన్మానం



టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన మారెపెల్లి కొమురయ్య, కుందనపల్లి గ్రామానికి చెందిన ఆరకొండ రాజయ్య అంబేద్కర్ యువజన సంఘంలో విశిష్ట సేలను అందించినందుకుగానూ సోమవారం మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏవైఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మధుపాక ఎల్లయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య సన్మానించారు. శాలువాలు కప్పి, ప్రశంస పత్రం, మొమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తప్పెట్ల వీరన్న, యాదగిరి, సురేందర్, రమేష్, కొమురయ్య పాల్గొన్నారు.

టీషర్ట్స్ అందజేత


టీషర్టులు అందజేస్తున్న విక్రమ్

కాటారం: మండల కేంద్రంలో కొనసాగుతున్న జీపీఎల్–2 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న స్వయం కృషి ఎలెవెన్ జట్టు సభ్యులకు యూత్ కాంగ్రెస్ నాయకుడు కడారి విక్రమ్ సోమవారం టీషర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేసినట్లు తెలిపారు. క్రీడాకారులు క్రీడా నైపుణ్యతను పెంపొందించుకొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వయం కృషి ఎలెవెన్ జట్టు కెప్టెన్ కొట్టె సతీశ్, ఆత్మకూరి కుమార్ యాదవ్, నిజాం, పున్నం సుమన్, వినయ్‌రావు, ప్రవీణ్, వేదాంత్, జుబేర్, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


దాడుల్లో పాల్గొన్న అధికారులు

కాటారం(మహాముత్తారం): గుడుంబా నిర్మూలన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా కాటారం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మహాముత్తారం మండలం రెడ్డిపల్లి, కనుకునూర్, సింగంపల్లి గ్రామాల్లో సోమవారం గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. మారుమూల గ్రామాల్లో అక్రమంగా గుడుంబా తయారీ, సరఫరా జరుగుతుందనే సమాచారం మేరకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు వరంగల్ ఎసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్, కాటారం ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించినట్లు కాటారం ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య తెలిపారు. ఈ దాడుల్లో 2400 లీటర్ల చెక్కర పానకం, తయారీ సామాగ్రి ధ్వంసం చేసి 50 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై వెల్లడించారు. గుడుంబా తయారీ, సరఫరా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజసమ్మయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రజిత, కాటారం ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా పంపిణీ సక్రమంగా చేపట్టాలి

- డీఏఓ బాబురావు


యూరియా పంపిణీని పరిశీలిస్తున్న డీఏఓ బాబురావు

కాటారం: రైతులకు యూరియా పంపిణీ సక్రమంగా చేపట్టాలని, పీఏసీఎస్, డీసీఎం కేంద్రాలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాలల్లో యూరియా, ఇతర ఎరువుల నిల్వలను ప్రదర్శించాలని డీఏఓ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాంలో నిల్వ ఉన్న యూరియా బస్తాలను ఆయన పరిశీలించి పంపిణీ ప్రక్రియను పర్యావేక్షించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. రైతులకు సరిపడా యూరియా అందుతుందని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. యూరియా దిగుమతికి అనుగుణంగా రైతులకు సర్దుబాటు చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం యూరియా పంపిణీ చేయాలని కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఏఓ వెంట ఏఓ పూర్ణిమ, సిబ్బంది ఉన్నారు.

'కార్మికులకు దక్కని లాభాల వాటా'

భూపాలపల్లి అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం మోసంతో కార్మికులకు సరైన లాభాల వాటా దక్కలేదని గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు మినహా ఇతర కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఏరియాలోని బీఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఎంఎస్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. సింగరేణి 2024–25 సంవత్సరానికి 69.01 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి రూ.6,394వేల కోట్లు నికర లాభాలు వచ్చాయన్నారు. ప్రభుత్వం ప్రకటించిన వివరాల ప్రకారం ఒక్కో కార్మికునికి రూ.2 లక్షలు వస్తున్నాయంటే మొత్తం రూ.819 కోట్లను మాత్రమే 34శాతం లాభంగా ప్రకటించారన్నారు. గత సంవత్సరం రూ2,360 కోట్ల లాభాలు చూపిస్తూ మిగిలిన వాస్తవ లాభాలను దాచేస్తున్నారని మండిపడ్డారు. వాస్తవ నికర లాభాలు రూ.6,394 కోట్లు వస్తే అందులో రూ.4,034 కోట్లను సంస్థ అభివృద్ధి కోసం పక్కన పెట్టినట్లు తెలిపారు. ఈ లెక్కన చూస్తే కార్మికులకు రూ.819 కోట్లలో 12.8శాతం వాటా మాత్రమే వస్తుందని వివరించారు. సింగరేణి కార్మికులను మోసం చేసిన రేవంత్‌రెడ్డి సర్కార్‌కు లొంగిన గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు ఒక్కటై కార్మికులను నమ్మించిన మోసం చేశాయని ఆరోపించారు. సింగరేణి కార్మికులు మేల్కొని లాభాల పంపిణీలో ప్రభుత్వానికి లొంగిపోయి కార్మికులకు అన్యాయం చేసిన గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలను కార్మికులు నిలదీయాలని కోరారు.

లాభాలను కార్మికులకు ఉపయోగించాలి

సింగరేణి కార్మికులను సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం నిరుత్సాహానికి గురి చేసిందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) బ్రాంచీ కార్యదర్శి కంపేటి రాజయ్య ప్రకటనలో ఆరోపించారు. కార్మిక వర్గం నుంచి 35శాతం లాభాల వాటా ఇవ్వాలని డిమాండ్ చేసిన 34 శాతం మాత్రమే ప్రకటించడం సంస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వసూళ్లు చేయకుండా కార్మికులు సాధించిన లాభాలను మళ్లించడం సరైందనికాదన్నారు. కార్మికుల చెమట చుక్కలతో వచ్చిన లాభాలను కార్మికుల అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు. ఇప్పటికైనా కార్మికుల పెండింగ్ సమస్యలపై యాజమాన్యం దృష్టి సారించాలని కోరారు.

యూరియా కోసం రైతుల ధర్నా


యూరియా కోసం ధర్నా చేస్తున్న రైతులు

రేగొండ: యూరియా కొరతను నిరసిస్తూ సోమవారం రేగొండ మండల కేంద్రంలో రైతులు ధర్నాకు దిగారు. సోమవారం మండలంలోని పీఏసీఎస్‌కు యూరియా వస్తుందని తెలియడంతో తెల్లవారుజామునుంచే వివిధ గ్రామాల రైతులు సొసైటీ వద్దకు వేల సంఖ్యలో చేరుకున్నారు. సొసైటీకి 400 బస్తాలు మాత్రమే రాగా అధికారులు పంపిణీ చేశారు. యూరియా అందని రైతులు ఆగ్రహించి పరకాల–భూపాలపల్లి ప్రధాన రహదారిపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులకు పలువురు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


నిందితుడిని, బియ్యాన్ని చూపిస్తున్న పోలీసులు

టేకుమట్ల: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సోమవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై దాసరి సుధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన మొలుగూరి గణేశ్ బొలెరో వాహనంలో సుమారు 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నాడు. కాగా, పోలీసులు మండలంలోని గర్మిళ్ళపల్లిశివారులో పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనాన్ని సీజ్ చేసి, అతడిపై కేసు నమోదు చేశారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: టేకుమట్ల మండల కేంద్రంలోని చలివాగు నుంచి ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక అక్రమ దందా నడుస్తుందని అధికారులు అరికట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతి గౌడ్ మాట్లాడుతూ.. నిత్యం వందలాది ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా దళారులు డంపింగ్ చేసి లారీల ద్వారా పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నాయకులు సంగి రవి, బచ్చల రామస్వామి, మేకల ఓంకార్, తాళ్లపల్లి రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


కాటారం: మాట్లాడుతున్న తిరుమల


భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న రజిత

- ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల

కాటారం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల అన్నారు. మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. పోషకహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యల్లో అనేక పోషక విలువలు ఉంటాయని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రొటీన్ ఫుడ్, గుడ్లు అందజేస్తుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ రాధిక, సూపర్‌వైజర్ వీణ, అంగన్‌వాడీ టీచర్లు కమలాదేవి, అన్నపూర్ణ, శ్రీలత, ప్రమీల, దివ్య, రోజ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో కేంద్రాల్లో పౌష్టికాహారం

భూపాలపల్లి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం లభిస్తుందని, బాలింతలు, గర్భినులు సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజిత అన్నారు. సోమవారం పట్టణంలోని హనుమాన్ నగర్ 1,2 అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు శాంతినగర్ సెంటర్లలో టీచర్లు బండారి పుష్పలత, ఆర్.పద్మ, లక్ష్మి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రజిత హాజరై మాట్లాడారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పుట్టిన వెంటనే గంటలోపు పిల్లలకు ముర్రుపాలు తాగిస్తే పిల్లలు బలంగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా టీచర్లు చిరుధాన్యాలు, కూరగాయలతో వేసిన చిత్రాలు అలరించాయి. ఆయాలు శారద, మహాలక్ష్మి, రజిని, తల్లులు, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

వెంకటాపురం(కె): క్రీడల్లో గెలుపోటములు సహజం అని వెంకటాపురం సీఐ ముత్యం రమేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ క్రీడా మైదానంలో డివిజన్ స్థాయి వెంకటాపురం ప్రీమియర లీగ్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని అన్నారు. ఈ పోటీలకు వెంకటాపురం, వాజేడు, ఏటూరు నాగారం మంగపేట మండలాల నుంచి పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.55,555, రెండో బహుమతి రూ.33,333, మూడో బహుమతి రూ.22,222, నాల్గో బహుమతి రూ.11,111లతో పాటు షీల్డును అందజేయనున్నట్లు క్రికెట్ పోటీల నిర్వాహకులు తెలిపారు. అనంతరం పోలీస్ టీమ్, ప్రెస్ టీమ్ ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడారు.